# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-06-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ప్రపంచంలో మన దేశం మూడో ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు వ్యవసాయరంగం ప్రముఖ పాత్ర పోషిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.
2. ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణంలో ఉన్న గృహాలను పూర్తి చేసేలా ప్రణాళికలను రూపొందిస్తున్నామని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు.
3. జనసేన పార్టీ అధ్యక్షులు కె.పవన్ కళ్యాణ్ విజయవాడలో ఈరోజు ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు.
4. తెలంగాణలో ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన పీజీఈసెట్ ఫలితాలు విడుదలయ్యాయి.
5. ఈరోజు 'ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినం" పాటిస్తున్నారు.

==========================

పీఎం కిసాన్ 17వ విడత నిధుల్ని వారణాసిలో "కిసాన్ సమ్మేళన్"లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిన్న విడుదల చేసారు. ఈ పథకం ద్వారా మొత్తం 9.26 కోట్ల మంది రైతుల ఖాతాల్లో 20 వేల కోట్ల రూపాయలు జమ చేశారు. అలాగే పారా ఎక్స్టెన్షన్ వర్కర్లుగా పని చేసేందుకు శిక్షణ పొందిన 30 వేల మందికిపైగా స్వయం సహాయ బృందాల మహిళలకు సర్టిఫికెట్లను ప్రధానమంత్రి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రపంచంలో మన దేశం మూడో ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు వ్యవసాయరంగం ప్రముఖ పాత్ర పోషిస్తుందని తెలిపారు. తమ కొత్త ప్రభుత్వం రైతులు, పేదలకు ప్రయోజనం కలిగించే అంశంపైనే తొలి నిర్ణయం తీసుకుందని తెలుపుతూ,

వాయిస్ (30 సెకన్లు)

--------------------------

17వ విడత కిసాన్ సమ్మాన్ నిధులను వారణాసి వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిన్న విడుదల చేయగా.. ఆ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో నిర్వహించారు. ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో 40.91 లక్షల మంది రైతులకు 824.6 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగింది.

--------------------------

పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా తెలంగాణలో 29.50 లక్షల మంది రైతులు లబ్ధి పొందుతున్నారని కేంద్ర జల్‌శక్తి, రైల్వే సహాయ మంత్రి వి.సోమన్న తెలిపారు. నిన్న 17వ విడత కిసాన్ సమ్మాన్ నిధులను వారణాసి వేదికగా ప్రధానమంత్రి  నరేంద్ర మోదీ విడుదల చేయగా.. ఆ కార్యక్రమాన్ని కేంద్రమంత్రి తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా  తెలంగాణలోని రైతులకు 590 కోట్ల రూపాయల లబ్ధి చేకూరిందని తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణంలో ఉన్న గృహాలను పూర్తి చేసేలా అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధ సారధి అధికారులను ఆదేశించారు. నిన్న విజయవాడలో  గృహనిర్మాణం, అభివృద్ధి పనులపై సంబంధింత అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, లబ్దిదారులకు అన్ని సౌకర్యాలతో గృహాలు నిర్మించే భాధ్యత ప్రభుత్వానిపై ఉందన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి, లబ్దిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని  చెప్పారు. ఇళ్ళ నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయి, నిర్మాణాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించటానికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదికలు సిద్దం చేయాలని అధికారులను ఆదేశించారు.

-------------------------

జనసేన పార్టీ అధ్యక్షులు కె.పవన్ కళ్యాణ్ ఈరోజు ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. పవన్ కళ్యాణ్ క్యాంపు కార్యాలయం కోసం కేటాయించిన విజయవాడలోని నీటిపారుదలశాఖ అతిథిగృహాన్ని నిన్న ఆయన పరిశీలించారు. అనంతరం వెలగపూడి సచివాలయానికి బయలుదేరిన పవన్ కళ్యాణ్‌కు  అమరావతి రాజధాని ప్రాంత రైతులు స్వాగతం పలికారు. సచివాలయం చేరుకున్న ఆయన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశం అయ్యారు. సచివాలయంలో రెండో బ్లాక్‌లోని తన కార్యాలయాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పరిశీలించారు.

-------------------------

తెలంగాణలో ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన పీజీఈసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో ఉన్నత విద్యాశాఖ అధికారులు ఈ ఫలితాలను నిన్న విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 20 వేల 626 మంది విద్యార్థులు రాశారు.. పరీక్ష ఫలితాలను పీజీఈసెట్ వెబ్‌సైట్ ద్వారా చూడవచ్చని అధికారులు తెలిపారు.

-------------------------

ఐక్య రాజ్యసమితి సూచనతో ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు ప్రపంచ దేశాలు ఈరోజు 'ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినం" పాటిస్తున్నారు. మానవ శరీరంలోని ఎర్ర రక్త కణాలను క్షీణింపచేసే అతి ప్రమాదకరమైన వ్యాధినే సికిల్ సెల్  అంటారు. ఈ వ్యాధికి గురైన వారి ఎర్రరక్తకణాలు... నెల వంక ఆకారంలోకి మారతాయి. ఫలితంగా అవయవాలకు తగినంత రక్త ప్రసారం జరగదు. ఈ వ్యాధికి గురైన వారు శరీర మార్పులను గమనిస్తూ..... తగిన చికిత్స పొందితే సికిల్ సెల్ వ్యాధిని అధిగమించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ సికిల్ సెల్ ఎనిమియా మిషన్ వ్యాధి పట్ల అవహగానా కల్పిస్తోంది.

వాయిస్ (1:05 సెకన్లు)

కాగా.. ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినం సందర్భంగా ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రసారం అవుతుంది.

---------------------------

తెలంగాణలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలు ఐటిఐలను అధునాతనంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని మల్లేపల్లి ఐటీఐలో అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఉద్యోగ ఉపాధి అవకాశాలే లక్ష్యంగా కోట్ల రూపాయలతో ఐటీఐల ఆధునికీకరణ పనులు చేపట్టామన్నారు. సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవడం వల్ల ఉద్యోగ భద్రత పెరిగి, జీవన ప్రమాణం వృద్ధి చెందుతుందని తెలిపారు. 65 ఐటీఐలను 2 వేల 324 కోట్ల రూపాయలతో ఏటీసీలుగా మార్చడం కోసం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ తో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

---------------------------

ప్రముఖ ధ్వన్యా నుకరణ కళాకారులు, డాక్టర్ నేరెళ్ళ వేణుమాధవ్ వర్ధంతి ఈరోజు, ఎంతోమంది ప్రముఖుల, రాజకీయ నాయకుల గళాలను అతి సునాయాసంగా అనుకరించిన ఆయన.. తెలంగాణాలోని వరంగల్‌లో 1932 డిసెంబర్ 28న జన్మించారు. ధ్వన్యా నుకరణ, మిమిక్రిలకు గాను కళా ప్రపూర్ణతో సహా పలు పురస్కారాలను, పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. ఆయన 2018 జూన్ 19వ తేదీన తుది శ్వాస విడిచారు. కాగా… నేరెళ్ళ గౌరవార్థం ఆయన పుట్టినరోజు డిసెంబర్ 28ని ప్రపంచ మిమిక్రీ దినోత్సవంగా జరుపుకోవడం విశేషం.

---------------------------

తెలంగాణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని అమలు చేయనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. నిన్న హైదరాబాద్‌లో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన ఔషధాలు అందుబాటులో ఉండేలా ఔషధ నియంత్రణ చట్టం… నాణ్యమైన ఆహారం విక్రయించేలా ఆహార భద్రత, నాణ్యత ప్రమాణాల చట్టాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ చర్యలు తీసుకుంటోందని అన్నారు. ప్రభుత్వ వైద్యసేవలు ప్రజలకు ఉచితంగా అందేలా చేయడంతో పాటు చట్టం నిర్దేశించిన నిబంధనల మేరకు ప్రైవేటు వైద్యసేవలూ అందుబాటులో ఉండేలా చేస్తామన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల పర్యవేక్షణ, ఔషధాల నియంత్రణ, ఆహార నాణ్యతకు సంబంధించి మూడు టాస్క్‌ఫోర్సులను ఏర్పాటుచేసి పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. నిన్న విజయవాడలో విద్యాశాఖ అధికారులు విడుదల చేశారు. పరీక్షల ఫలితాల్లో 59 శాతం ఉత్తీర్ణత నమోదయిందని అధికారులు తెలిపారు. మే 24 నుంచి జూన్ 1వరకు జరిగిన ఈ పరీక్షలకు మొత్తం లక్షా 27 వేల 190 మంది విద్యార్థులు హాజరు కాగా.. వీరిలో 74 వేల 868 మంది ఉత్తీర్ణత సాధించారని అధికారులు వెల్లడించారు. పరీక్షల ఫలితాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చని తెలిపారు.

======================